ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## ఎన్‌డీఏ అంటేనే సుపరిపాలన

భారత్ స్ఫూర్తిని నిలిపిన కూటమి ఇది..
ఇది విజయవంతమైన భాగస్వామ్యం
పేదల సంక్షేమమే మనందరి కర్తవ్యం..
ఎన్‌డిఏ భేటీలో ప్రధాని మోడీ ఉద్ఘాటన 2లో..

సంపుటి: 2 | సంచిక: 58 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 8 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## యుద్ధ ప్రాతిపదికన పార్వతి బ్యారేజ్ పునరుద్ధరణ పనులు

ప్రతి పనికి నిర్దిష్ట సమయం నిర్దేశిరచుకోవాలి
డ్యామ్ సెఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం బ్యారెజ్ పునరుద్ధరణ
బ్యారేజ్ వల్ల వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు
నిర్మాణ సంస్థలకు మంత్రి ఉత్తమ్ కుమార్ ఆదేశం
అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల పరిశీలన
94 వేల కోట్లతో కట్టినా పనికిరాకుండా పోయిందన్న ఉత్తమ్

కరీంనగర్, జూన్ 7 (ప్రభాత ఉదయం): కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బ తిన్న చోట్ల మరమ్మతు పనులను వేగవంతం చేయాలని నిర్మాణ సంస్థల ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల పరిశీలనకు మంత్రి ఉత్తమ్ వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వల్ల కాళేశ్వరంపై రివ్యూ జరగ లేదు. భారాస హయాంలోనే మేడిగడ్డ కుంగింది. రూ.94 వేల కోట్లు అప్పు చేసి కట్టిన ప్రాజెక్టు కుంగిపోతే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానికి వడ్డీ కట్టాల్సి వస్తోంది. కాంగ్రెస్.. ..మిగతా 2లో

# ఎన్‌డిఏ పక్షనేతగా మోడీ ఏకగ్రీవ ఎన్నిక

రాజ్‌నాథ్ ప్రతిపాదనకు అమిత్ షా మద్దతు
మద్దతు తెలిపిన ఎన్‌డిఏ నేతలు బాబు, నితీశ్ తదితరులు
మోడీ విజనరీ నేత అంటూ చంద్రబాబు పొగడ్తలు
దేశానికి సరైన సమయంలో దొరికి సరైన నేత అంటూ కితాబు



న్యూఢిల్లీ, జూన్ 7 (ప్రభాత ఉదయం): ఎన్డీయే పక్ష నేతగా నరేంద్ర మోడీ మూడోసారి ఎన్నికయ్యాడు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్డీయే పార్లమెంటరీ పక్ష సమావేశంలో ఎన్డీయే కూటమి ఈ మేరకు మోడీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఎన్డీయే పక్ష నేతగా మోడీ పేరును రాజనాథ్ సింగ్ ప్రతిపాదించగా అమిత్ షా, గడ్కరీ, కుమారస్వామి, చంద్రబాబు, నితీశ్ కుమార్ తదితర ఎన్డీఏ నేతలు బలపరిచారు. ఈ సమావేశానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా హాజరయ్యారు. ఈ ప్రతిపాదనకు నూతన ఎంపీలు అందరూ ఆమోదం తెలిపారు. దీంతో మూడోసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగుమమైంది. ఈ ప్రతిపాదనను ఎన్‌డిఏ నేతలు రాష్ట్రపతి ముర్మకు అందచేస్తారు. ఈ నెల 9న సాయంత్రం 6 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో మోడీ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మోడీని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. నరేంద్ర మోడీ అంతర్జాతీయంగా దేశానికి ప్రతిష్ఠ తీసుకొచ్చారని అన్నారు చంద్రబాబు. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు మోడీ నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. మోడీ నేతృత్వంలో భారత్ అగ్రదేశంగా ఎదుగుతుందని అన్నారు. ఏం సాధించాలన్న విజన్ కావాలని, మోడీ విజన్ ఉన్న నాయకుడని అన్నారు. భారత్ అగ్రదేశంగా ఎదగటానికి ఇది గొప్ప అవకాశం ఉందని అన్నారు. మొదటి నుండి ఎన్డీయేతో టీడీపీకి మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. తనకు ఏ ఇజాలు తెలియవని, మానవత్వమే తన ఇజం అని ..మిగతా 2లో



## రాష్ట్రపతి ముర్ముతో మోడీ భేటీ

ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని వినతి
ఎన్‌డిఏ నేతగా ఎన్నికైనట్లుగా పత్రం అందచేత
ఆదివారం నాటి ప్రమాణానికి రాష్ట్రపతి ఆమోదం
ముచ్చటగా మూడోసారి ప్రమాణానికి మోడీ సిద్ధం
మంత్రివర్గ కూర్పుపై పార్టీ సీనియర్లతో మోడీ కసరత్తు
కార్యక్రమానికి హాజరు కానున్న విదేశీ ప్రతినిధులు

న్యూఢిల్లీ, జూన్ 7 (ప్రభాత ఉదయం): ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికైన నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం ప్రధానిగా ప్రమాణం చేయనున్నారు. వరుసగా మూడోసారి ఆయన ప్రధాని బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఎన్‌డిఏ భేటీ తరవాత శుక్రవారం సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మోడీ కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా తనను లోక్ సభ పక్షనేతగా ఎన్డీయే మిత్రపక్షాలు ఎన్నుకున్న తీర్మానాన్ని రాష్ట్రపతికి అందజేశారు. మోదీ వెంట ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు ఉన్నారు. తమ కూటమికి మద్దతు ఇస్తోన్న పార్టీల లేఖలు, కొత్తగా ఎంపికైన మొత్తం ఎంపీల జాబితాను రాష్ట్రపతికి మోదీ అందించారు. ఈ క్రమంలో కేంద్రంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని మోదీని రాష్ట్రపతి ఆహ్వానించారు. మోదీకి రాష్ట్రపతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఓ జ్ఞాపికను బహూకరించారు. దేశానికి మరింత సేవ చేయాలని ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారని.. దేశ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తామని మోదీ అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన అనంతరం ఆయన విరీడియాతో మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతిచ్చే ఎంపీల జాబితాను రాష్ట్రపతికి అందించామని.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరినట్లు చెప్పారు. ఈ నెల 9న ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు రాష్ట్రపతికి తెలియజేశామని వెల్లడించారు. ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎన్డీయే కూటమి నేతలు శుక్రవారం ఉదయం కీలక సమావేశం నిర్వహించారు. టీడీపీ ..మిగతా 2లో



ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రం స్వీకరిస్తున్న ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి

## ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తాం

ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి

హైదరాబాద్,జూన్ 7(ప్రభాత ఉదయం): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పాలనా పరమైన అడ్డంకులు తొలగాయని,ప్రజావాణిలో అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నా రెడ్డి తెలిపారు.మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నుంచి పునః ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంలో చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కారణంగా సుమారు 3 నెలల సుదీర్ఘ విరామం తరువాత ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారులకు వివరించారు.అన్ని విభాగాలకు సంబందించి మొత్తం 373 దరఖాస్తులు నమోదయ్యాయి.రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 120 దరఖాస్తులు,విద్యా శాఖకు సంబందించి 43,మున్సిపల్ శాఖకు సంబందించి 43, హెూం శాఖకు సంబందించి 29,పౌరసరఫరాల శాఖకు సంబందించి 18, ఇతర శాఖలకు సంబందించి 120 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి అధికార వర్గాలు తెలిపాయి.ప్రజావాణి ప్రత్యేక అధికారి,మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్య,ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు.



## పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

బెయిల్ మంజూరు చేసిన కర్నాటక కోర్టు 2

## సీడబ్ల్యూసీ భేటీ కోసం ఢిల్లీకి వెళ్లిన సిఎం రేవంత్

రాష్ట్ర వ్యవహారాలపై కాంగ్రెస్ పెద్దలతో సమాలోచన



హైదరాబాద్, జూన్ 7 (ప్రభాత ఉదయం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. శనివారం ఢిల్లీలో జరిగే సీడబ్ల్యూసీ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలతో సీఎం సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు మంత్రివర్గ విస్తరణ జరగలేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ఈ అంశంపై చర్చించే అవకాశం ఉంది. అలాగే నామినేటెడ్ పోస్టుల భర్తీ, పీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపిక తదితర విషయాలపై చర్చిస్తారని సమాచారం. సీడబ్ల్యూసీ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ కూడా పాల్గొననున్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు వంశీచంద్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ హాజరు కానున్నారు.



## 21 వరకు కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, జూన్ 7 (ప్రభాత ఉదయం): ఢిల్లీ మద్యం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు జ్యుడీషియల్ కస్టడీ కోరుతూ శుక్రవారం సీబీఐ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. దీంతో మరోసారి కవితకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది. జూన్ 21 వరకు రౌస్ అవెన్యూ కోర్టు కవితకు కస్టడీని పొడిగించింది. తదుపరి విచారణను జూన్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. అదే రోజు సీబీఐ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ జరపనున్నది. సీబీఐ కేసులో కవితపై దాఖలైన చార్జిషీట్‌ను కోర్టు విచారణకు తీసుకున్నది. తాను చదువుకోవడానికి కొత్తగా 9 పుస్తకాలు కావాలని కోర్టును కవిత కోరింది. కవిత అభ్యర్థనను రౌస్ అవెన్యూ కోర్టు అంగీకరించింది.

## ధాన్యం ఉత్పత్తిలో అగ్రగామిగా రాష్ట్రం

రాష్ట్రవ్యాప్తంగా 1.2 కోట్ల ఎకరాల్లో ధాన్యం ఉత్పత్తి
ప్రపంచ వరి సదస్సులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



హైదరాబాద్, జూన్ 7 (ప్రభాత ఉదయం): ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. తెలంగాణలో క్రమంగా ధాన్యం ఉత్పత్తి పెరుగుతున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.2 కోట్ల ఎకరాల్లో ధాన్యం ఉత్పత్తి జరుగుతున్నదని పేర్కొన్నారు. ఆహార భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు. అందరికీ ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ వేదికగా జరుగుతున్న ప్రపంచ వరి సదస్సును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ..మిగతా 2లో

# ఎన్‌డిఎ పక్షనేతగా
# మోడీ ఏకగ్రీవ ఎన్నిక

మొదటి పేజీ తరువాయి...

ఎన్టీఆర్ అన్నారని గుర్తు చేశారు. తన జీవితంలోనే ఇదొక గొప్ప సందర్భమని అన్నారు. ఎన్నికల సమయంలో కీలక ప్రచార సభల కోసం మోడీ వచ్చారని అన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంపై తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రశంసల జల్లు కురిపించారు. భారత్‌కు సరైన సమయంలో సరైన నాయకుడు దొరికారని, ఆయన నరేంద్ర మోదీ అని చంద్రబాబు పొగిడారు. నరేంద్ర మోదీకి విజన్, ఉత్సాహం ఉన్నాయని, పరిపూర్ణ కార్యదక్షత కలిగిన నాయకుడని అన్నారు. తన విధానాలన్నింటినీ నిజమైన స్ఫూర్తితో అమలు చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం భారత్‌కు చాలా మంచి అవకాశమని, ఇప్పుడు మిస్ అయితే ఎప్పటికీ నష్టపోతామని చంద్రబాబు వ్యాఖ్యానించారు.'ఎన్డీయేను అధికారంలోకి తీసుకురావడానికి మోదీ రేయింబవళ్లు కష్టపడ్డారు. ఎన్డీఏ అద్భుత మెజారిటీ సాధించింది. ఎంతోమంది నేతలను చూశాను కానీ మోదీ లాంటి పవర్‌పుల్ నేతలను ఎక్కడా చూడలేదు. ఏపీలో మోదీ కీలక ప్రచార సభలకు హాజరయ్యారు. మేకిన్ ఇండియా విజన్‌తో దేశాన్ని ముందుండి నడిపించారు. మోదీ విజన్ వల్లే దేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అంతర్జాతీయ స్థాయిలోనూ భారత్ పేరు ప్రఖ్యాతులను మోదీ ఇనుమడింపజేశారు' అని చంద్రబాబు ప్రశంసించారు. మోదీ విజన్, సమర్థత దేశానికి ఎంతో అవసరని ఈ సందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు. దేశానికి మోదీ ఎన్నో అద్భుత విజయాలు అందించారని, దేశంలో యువశక్తి ఐటీ రంగంలో దూసుకుపోతోందని ప్రస్తావించారు. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు మోదీ నాయకత్వం వహిస్తున్నారని, ఏం సాధించాలన్నా ఒక విజన్ ఉండాలని, మోదీ విజన్ ఉన్న నాయకుడని చంద్రబాబు మెచ్చుకున్నారు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన నూతన ఎంపీలు అందరినీ ఆయన అభినందించారు.





## ధాన్యం ఉత్పత్తిలో అగ్రగామిగా రాష్ట్రం

మొదటి పేజీ తరువాయి...

ప్రారంభించారు. రెండు రోజులపాటు జరుగుతున్న ఈ సదస్సులో భారత్ సహా 30 దేశాలు పాల్గొన్నాయి. శావేత్తలు, రైస్ మిల్లర్ల సంఘాల ప్రతినిధులతోపాటు 250 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్‌లో వరిసాగు, ఉత్పత్తి, నాణ్యత, విదేశీ ఎగుమతుల పెంపుపై చర్చించనున్నారు. టెక్నాలజీ, మార్కెటింగ్, ఆహార భద్రత లక్ష్యాలుగా మేధోమథనం జరుగనుంది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమన్నారు. ఇటీవలే దశాబ్ది ఉత్సవాలు జరుపుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో రైస్ సమ్మిట్ నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణ వరి ఉత్పత్తి థాయ్‌లాండ్‌తో సమానమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తమది రైతు అనుకూల ప్రభుత్వమని చెప్పారు. వ్యవసాయానికి అన్ని రకాలుగా ప్రభుత్వం మద్దతు ఇస్తున్నదని తెలిపారు. రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు సేకరిస్తున్నదని వెల్లడించారు. వివిధ పథకాల కింద పౌషికాహారం పోర్టిఫికేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 3 వేల అత్యాధునిక రైస్ మిల్లులు ఉన్నాయని చెప్పారు. తెలంగాణలో నీటిపారుదల వనరులు పెరుగుతున్నాయని తెలిపారు.




## యుద్ధ ప్రాతిపదికన పార్వతి బ్యారేజ్ పునరుద్ధరణ పనులు

మొదటి పేజీ తరువాయి...

అధికారంలోకి రాగానే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీని సంప్రదించి పరిశీలన చేయమని కోరాం. నిపుణుల కమిటీ కొన్ని సూచనలు చేసింది. మేడిగడ్డ కుంగిన వెంటనే గేట్లు ఎత్తి ఉంటే ఇంత డ్యామేజీ జరిగేది కాదని తేల్చింది. దెబ్బతిన్న చోట్ల కొన్ని రిపేర్లు చేసి అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల మూడు బ్యారేజీల గేట్లు ఎత్తిపెట్టాలని చెప్పింది. ఆ పనుల పరిశీలన చేయడానికి వచ్చా. మేడిగడ్డ, అన్నారం వద్ద పనులు వేగంగా జరుగుతున్నాయి. సుందిళ్ల బ్యారేజీ పనులు నెమ్మదిగా జరుగుతుండటంతో వేగవంతం చేయాలని చెప్పాం. వర్షాలకు ముందే పనులు పూర్తి కావాలని నిర్మాణ సంస్థలను ఆదేశించాం. తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మిస్తాం అని ఉత్తమ్ చెప్పారు. రిపేర్లు చేసినా బ్యారేజీల గేట్లు ఎత్తాల్సిందే నన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. కాళేశ్వరంలోని బ్యారేజీలను పరిశీలించిన ఉత్తమ్.. ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. నిపుణుల కమిటీ సూచనలు ఇచ్చే వరకు గేట్లు ఓపెన్ చేస్తామని చెప్పారు. కేసీఆరేమో నీళ్లు స్టోరేజ్ చేయొచ్చని ప్రచారం చేస్తున్నారు.. ఎన్డీఎస్ఏ వద్దంటోందని అన్నారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజ్ లో పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు ఉత్తమ్. సుందిళ్లలో నవయుగ కంపెనీ పనుల్లో ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. పనులు వేగవంతం చేయాలని నవయుగ కంపెనీ ప్రతినిధులను హెచ్చరించామన్నారు. కాంట్రాక్టు నిర్మాణ సంస్థల ఖర్చుతోనే ప్రస్తుతం తాత్కాలిక మరమ్మత్తులు జరుగుతున్నాయని చెప్పారు. ఎల్లంపల్లికి నీటిని ఎత్తి పోయవచ్చని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే మేడిగడ్డ కుంగిందన్నారు. పాలమూరు రంగారెడ్డికి 20 వేల కోట్లు ఖర్చు పెట్టి ఎకరాకు నీళ్ళియ్యలేదన్నారు. ఎన్నికల కోడ్ ఉండటంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై రివ్యూ చేయలేదన్నారు ఉత్తమ్. కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా ఉంది.. 90వేల కోట్లకు వడ్డీ చెల్లిస్తున్నామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఫలితాలు చూసిన తర్వాత కేసిఆర్ గురించి మాట్లాడుకోడం వేస్ట్ అని అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు నీళ్లు వచ్చే ప్రాజెక్ట్ చేపట్టడతామని చెప్పారు. సుందిళ్ళ బ్యారేజ్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, గుత్తేదారు ఏజెన్సీలను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మించిన మూడు బ్యారేజ్ ల సందర్శనలో భాగంగా శుక్రవారం తొలుత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంథని మండలం సిరిపురం గ్రామం వద్ద నిర్మించిన సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ ను సందర్శించారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ ను ఆసాంతం మంత్రి పరిశీలించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మత్తు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి కావాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అవసరమైన మేర అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని మంత్రి అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. బ్యారేజ్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని, ప్రతి పనికి సంబంధించి నిర్దేశిత సమయాన్ని నిర్దేశించుకొని దానిలోపు ఆ పని పూర్తి చేసే విధంగా ఏజెన్సీలు పనిచేయాలని, ఏ పని ఎప్పటి వరకు పూర్తవుతుందో కాగితంపై షెడ్యూల్ రూపొందించి అందించాలని మంత్రి ఆదేశించారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ సమీపంలో గల పంప్ హౌస్ సంరక్షణ కోసం నిర్మిస్తున్న కట్ట వల్ల స్థానికులకు కలిగే నష్టాన్ని స్థానిక మంత్రివర్యులు తో కలిసి అంచనా వేసి వాటి పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి సంబంధిత ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. ప్రాజెక్టు ఈ.ఎన్.సి అనిల్ కుమార్ జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న పనుల వివరాలను మంత్రికి వివరించారు. రాబోయే వానాకాలంలో మూడు బ్యారేజీల సంరక్షణకు, తదుపరి ఎటువంటి డ్యామేజీ జరగకుండా పనులు చేపట్టామని ఈఎన్సీ తెలిపారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ వద్ద కొట్టుకుపోయిన ఇసుక పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని , జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం జియో ఫిజికల్, జియో టెక్నికల్ జనరల్ పరీక్షలు నిర్వహించి కొట్టుకుపోయిన ఇసుకను అంచనా వేసి వాటిని పునరుద్ధరించి బ్యారేజ్ ఎటువంటి మరమ్మత్తుకు గురికాకుండా సంరక్షణ చర్యలు చేపడుతున్నామని, మంత్రి ఆదేశాల మేరకు పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేసి రాబోయే పది రోజుల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామని ఈఎన్సీ అన్నారు. అనంతరం వీరీడియాతో రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయినప్పటికి నిర్లక్ష్యం వహిస్తూ ఎటువంటి మరమ్మత్తులు చేపట్టలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 3 బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, దేశంలోనే పార్లమెంట్ ద్వారా ఏర్పాటు చేసిన అత్యున్నత సంస్థ అయిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అధారిటీలకు బాధ్యత అప్పగించడం జరిగిందని అన్నారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన మధ్యంతర నివేదిక ప్రకారం రాబోయే వానా కాలంలో మూడు బ్యారేజీల సంరక్షణ కోసం పనులు చేపట్టామని, క్షేత్రస్థాయిలో బ్యారేజీలను పరిశీలించి ఆ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా సంబంధిత ఏజెన్సీలను, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను పరిశీలించేందుకు తమ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ జడ్జ్ జస్టిస్ ఆధ్వర్యంలో వేసిన జ్యుడీషియల్ కమిషన్ సైతం ప్రాజెక్టును సందర్శిస్తుందని మంత్రి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీని తప్పనిసరిగా నిర్మిస్తామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం భూపాల్ పల్లి జిల్లాలో ఉన్న అన్నారం(సరస్వతి) బ్యారేజీ సందర్శనకు మంత్రి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈ.ఎన్.సి జనరల్ జి.అనిల్ కుమార్, ఎస్.ఈ.ఏం. కరుణాకర్, ఈ.ఈ. సర్దార్ ఓంకార్ సింగ్, ఇతర నీటీ పారుదల అధికారులు, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రపతి ముర్ముతో మోడీ భేటీ

మొదటి పేజీ తరువాయి...

అధినేత చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్,ఏక్‌నాథ్ షిండే, చిరాగ్ పాశ్వాన్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ ఎన్డీయే పక్షనేతగా మోదీని ప్రతిపాదించగా ఎంపీలంతా ఆమోదించారు. ఈ క్రమంలో ఆయన మూడోసారి ప్రధానిగా ఈ నెల 9న కర్తవ్యపథ్‌లో ప్రమాణం చేయనున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మోదీ బాధ్యతలు చేపట్టేలా ముహూర్తం ఖరారు చేశారు. ఆ రోజు ప్రధానితో పాటు కొందరు మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతిచ్చే ఎంపీల జాబితాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు అందజేశామని ప్రధాని మోదీ తెలిపారు. ఆజాదీ కా అమృత్ ఉత్సవాల తర్వాత జరిగిన మొదటి ఎన్నికలు ఇవి. దేశానికి మరింత సేవ చేయాలని ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు. దేశ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తాం. ప్రజల ఆకాంక్షల మేరకు మరింత ఉత్సాహంగా పని చేస్తాం. ఇవాళ ఉదయమే ఎన్డీయే నేతలంతా కలిసి చర్చించాం. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని రాష్ట్రపతిని కోరాం. ఆదివారం ప్రమాణ స్వీకారం చేస్తామని రాష్ట్రపతికి తెలియజేశాం అని మోదీ తెలిపారు. మోడీ ప్రమాణ స్వీకార ఈ కార్యక్రమానికి రావాలని పలువురు దక్షిణాసియా నేతలకు ఆహ్వానాలు అందాయి. మాల్దీవ్స్ ప్రెసిడెంట్ మహమ్మద్ ముయిజ్జును కూడా పిలిచారు. మయిజ్జు మోదీకి అభినందనలు కూడా తెలిపారు. ఆయన ఆ ఆహ్వానాన్ని స్వీకరించారు. గతకొంత కాలంగా మయిజ్జు చైనా దేశానికి అనుకూలంగా పని చేస్తూ.. భారత్ కు వ్యతిరేకంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు కూడా దూరమవుతున్నట్లు కనిపిస్తుంది. శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, మారిషస్ దేశాల నేతలకు ప్రమాణస్వీకారానికి రావాల్సిందిగా ఆహ్వానాలు అందాయి. ప్రమాణ స్వీకారోత్సవానికి మోదీ ఆయనను ఆహ్వానించినట్లు శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే కార్యాలయ వీరిడియా విభాగం తెలిపింది. విక్రమసింఘే ఆహ్వానాన్ని అంగీకరించారని, ఎన్నికల విజయంపై మోదీకి ఫోన్‌లో అభినందనలు తెలిపారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, నేపాల్ నేత పుష్ప కమల్ దహాల్ ప్రచండ కూడా వేడుకకు హాజరు కావాల్సిందిగా కోరారు.



## ఎన్‌డీఎ అంటేనే సుపరిపాలన

### భారత్ స్ఫూర్తిని నిలిపిన కూటమి ఇది.. ఇది విజయవంతమైన భాగస్వామ్యం
### పేదల సంక్షేమమే మనందరి కర్తవ్యం.. ఎన్‌డిఎ భేటీలో ప్రధాని మోడీ ఉద్ఘాటన

న్యూఢిల్లీ, జూన్ 7 (ప్రభాత ఉదయం): ఎన్డీయే అంటేనే సుపరిపాలన. మన కూటమి అసలైన భారత్ స్ఫూర్తిని చాటుతుంది. మనది అత్యంత విజయవంతమైన భాగస్వామ్యం' అని నరేంద్రమోదీ అన్నారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం దిల్లీలో శుక్రవారం జరిగింది. ఇందులో తమ లోక్‌సభా పక్ష నేతగా మోదీని ఎన్డీయే నేతలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిత్రపక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లలో ఈ కూటమి దేశాన్ని మూడుసార్లు ఐదేళ్లు పాలించింది. మరోసారి ఐదేళ్ల పాలనకు ప్రజలకు అవకాశమిచ్చారు. దేశం కోసం నిబద్ధత కలిగిన బృందం ఇది. ఎన్డీయే అంటేనే సుపరిపాలన. పేదల సంక్షేమమే మనందరి ప్రథమ కర్తవ్యం. దేశ అభివృద్ధి చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించాం. వికసిత్ భారత్ స్వప్నాన్ని సాకారం చేసి తీరుతాం. మన కూటమి అసలైన భారత్ స్ఫూర్తిని చాటుతుంది. ఎన్నికల ముందు పొత్తు పెట్టుకున్న కూటమి ఇంతగా ఎప్పుడూ విజయవంతం కాలేదు. ప్రభుత్వం ఏర్పాటు కావాలంటే సంఖ్యాబలం అవసరం. దేశాన్ని నడపాలంటే సర్వసమ్మతం కావాలి. కూటమిలో పరస్పర విశ్వాసమే ప్రధానం. అన్ని అంశాల్లో ఏకగ్రీవ నిర్ణయాలే లక్ష్యం' అని మోదీ అన్నారు. ఇక ఔఆం అంటే 'న్యూ ఇండియా, డెవలప్డ్ ఇండియా, ఆస్పిరేషనల్ ఇండియా' అని కొత్త అర్థం చెప్పారు. దక్షిణాది ప్రజలు ఎన్డీయేను ఆదరించారు. కర్ణాటక, తెలంగాణలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అతి తక్కువ కాలంలోనే అక్కడి ప్రభుత్వాలు ప్రజల విశ్వాసం కోల్పోయాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రాల్లోని ప్రజలు భాజపాకు అండగా నిలిచారు. తమిళనాడులో సీట్లు గెలవలేకపోయినా ఓట్లు పెరిగాయి. కేరళలోనూ మా కార్యకర్తలు ఎన్నో బలిదానాలు చేశారు. తొలిసారి అక్కడి నుంచి మా ప్రతినిధి సభలో అడుగుపెడుతున్నారు. అరుణాచల్, సిక్కింలో క్లీన్‌స్వీప్ చేశాం. ఏపీ ప్రజలు కూటమికి పెద్ద ఎత్తున మద్దతిచ్చారు. చంద్రబాబుతో కలిసి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నాం. ఏపీలో ఇంత భారీ విజయం ప్రజల ఆకాంక్షలను అద్దం పట్టిందని మోదీ కొనియాడారు. ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించింది. అయినా కూడా విపక్షాలు మన విజయాన్ని తిరస్కరించేందుకు ప్రయత్నించాయి. మనం ఓడిపోయామని చిత్రీకరించాలని చూశాయి. కానీ, మనకు ఓటమి లేదని దేశ ప్రజలకు తెలుసు. ఎన్నికల ముందు ఈవీఎంలను కొందరు సందేహించారు. ఫలితాల తర్వాత అవన్నీ పటాపంచలయ్యాయి. ఇకనైనా విపక్షాలు పార్లమెంట్‌లోకి వచ్చి చర్చల్లో పాల్గొంటాయని భావిస్తున్నానని మోదీ చురకలంటించారు.



## అద్వానీని కలసి ఆశీర్వాదం తీసుకున్న మోడీ

న్యూఢిల్లీ, జూన్ 7 (ప్రభాత ఉదయం): ఎన్డీయే లోక్‌సభాపక్ష నేతగా ఎన్నికైన నరేంద్ర మోదీ భాజపా కురువృద్ధుడు ఎల్.కె.అద్వాణీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసిన తర్వాత నేరుగా ఆయన ఇంటికివెళ్లిన మోదీ... వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతున్న విషయాన్ని ఆయనకు స్వయంగా చెప్పారు. ఇద్దరు నేతలూ వివిధ అంశాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు. అక్కడి నుంచి పార్టీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి ఇంటికి వెళ్లిన మోదీ.. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్డీయే కూటమి నేతలతో కలిసి మోదీ మరికాసేపట్లో రాష్ట్రపతి భవన్‌కు చేరుకోనున్నారు. తమ వద్ద ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలం ఉందని చెబుతూ.. అవకాశం ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజ్ఞప్తి చేయనున్నారు. శుక్రవారం దిల్లీలో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నరేంద్ర మోదీని లోక్‌సభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. తాజా సార్వత్రిక ఎన్నికల్లో భాజపా 240 స్థానాల్లో విజయం సాధించింది. అయితే, మిత్రపక్షాలతో కలిసి 293 స్థానాలను సొంతం చేసుకొని ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది.



## పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

### బెయిల్ మంజూరు చేసిన కర్నాటక కోర్టు

బెంగళూరు, జూన్ 7 (ప్రభాత ఉదయం): 'పరువునష్టం కలిగించే' ప్రకటనలు వేయించినందుకు బిజెపి కర్నాటక శాఖ దాఖలు చేసిన కేసు సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బెంగళూరులోని ప్రత్యేక కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రచురించిన ప్రకటనల్లో రాష్ట్రంలోని అప్పటి బిజెపి ప్రభుత్వం తన 2019 2023 పాలనలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. పరువునష్టం కేసు సందర్భంగా కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఈ నెల 1న కోర్టుకు హాజరైనప్పుడు వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 7న కోర్టుకు తప్పనిసరిగా హాజరు కావాలని రాహుల్ గాంధీని న్యాయమూర్తి కెఎన్ శివకుమార్ ఆ రోజు ఆదేశించారు. గత రెండు విచారణలకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరినందుకు రాహుల్ గాంధీ శుక్రవారం క్షమాపణ తెలియజేశారు. కోర్టు ఆయన క్షమాపణను అంగీకరించి రూ. 75 లక్షల ష్యూరిటీతో బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీతో పాటు సిద్ధరామయ్య, శివకుమార్ కూడా కోర్టుకు హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్నాటకలోని అన్ని ప్రధాన స్రవంతి దినపత్రికల్లో నిరుడు మే 5న నిందితులు 'అవినీతి రేటు కార్డు', '40 శాతం కమిషన్ సర్కార్' శీర్షిక కింద జారీ చేసిన ప్రకటనల్లో తప్పుడు, నిర్లక్షపూరిత ఆరోపణలు చేశారని నిరుడు జూన్‌లో దాఖలు చేసిన ఫిర్యాదులో బిజెపి ఆరోపించింది. కెపిసిసి అధ్యక్ష హోదాలో శివకుమార్, శాసనసభలో అప్పటి ప్రతిపక్ష నాయకుని హోదాలో సిద్ధరామయ్య ద్వారా కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) ఆ ప్రకటనలు జారీ చేసిందని బిజెపి తన ఫిర్యాదులో ఆరోపించింది. రాహుల్ గాంధీ ఆ 'పరువునష్టం కలిగించే ప్రకటన'ను తన సామాజిక మాధ్యమం 'ఎక్స్' పోస్ట్‌లో పొందుపరిచారని బిజెపి పేర్కొన్నది. రాహుల్ గాంధీ స్వయంగా కోర్టు ముందు హాజరైన తరువాత బిజెపి 'ఎక్స్' పోస్ట్‌లో వ్యాఖ్యానిస్తూ, 'నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్‌పై విడుదలైన నిందితుడు రాహుల్ గాంధీ ! నమ్మ బెంగళూరుకు వీరికు స్వాగతం. కర్నాటకలోని మా నేతలపై వీరీరు ఉపయోగించిన, ఇప్పటి వరకు వీరీరు రుజువు చేయలేకపోయిన తప్పుదారి పట్టించే, పరువునష్టం పూర్వక ప్రకటనలకు సంబంధించి భారతీయ చట్టాల పరిణామాలను అనుభవించేందుకు వీరీకు స్వాగతం పలుకుతున్నాం' అని పేర్కొన్నది.

# ఇద్దరు యువకుల హత్య కేసులో ఏడుగురు అరెస్ట్

## శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ నారాయణరెడ్డి





శంషాబాద్,జూన్ 7(ప్రభాత ఉదయం):వాట్సాప్ గ్రూప్ లో అధిక సంఖ్యలో ఫోటోలు పంపడం,పార్టీ మార్పు కారణంగా ఇద్దరూ వ్యక్తులు హత్యకు గురయ్యారని శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ నారాయణరెడ్డి అన్నారు.శుక్రవారం శంషాబాద్ డిసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ%ూ%కడ్తాల్ మండలం గోవిందాయపల్లి కి చెందిన జల్కం రవి,గుండమోని శివ,శేషగిరి శివలు గతంలో బీజేవైఎం ఆర్గనైజేషన్ లో పని చేసేవారని,ఈ మధ్యకాలంలో మృతులు ఇద్దరూ రవితో మనస్పర్థల కారణంగా బీజేవైఎం ఆర్గనైజేషన్ నుండి బయటకు వచ్చి కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలుగా చేరారు అని పేర్కొన్నారు.అప్పటినుండి వారి మధ్య వ్యక్తిగత ద్వేషాలు పెరిగాయని,ఈనెల 4న జల్కం రవి పుట్టినరోజు సందర్భంగా గోవిందయ పల్లిలో అద్దెకు నివాసం ఉంటున్న బటర్ఫ్లై సిటీ వెంచర్ లోని ఓ విల్లాలో వేడుకలు నిర్వహించారు.పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ఫోటోలను గోవిందాయ పల్లి గ్రామానికి చెందిన వాట్సప్ గ్రూపులో సుమారు 200 నుంచి 300 వరకు ఫోటోలు పోస్ట్ చేశారని వాటిని వారు అధిక సంఖ్యలో పోస్ట్ చేయడం ద్వారా ఆ ఫోటోలను,అతనిని వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించారని పేర్కొన్నారు.దీంతో జల్కం రవి ఆగ్రహానికి గురి కావడంతో,తనను గ్రామంలో అవమానపరిచిన వ్యక్తులను తుది ముట్టించాలని ప్రణాళిక రచించారు.ఈ నేపథ్యంలో తన స్నేహితులు అయిన పల్లె నాగరాజుగౌడ్,తలకొండ రాజు,గిలుకుంట్ల విజయ్,నిట్ట ప్రవీణ్,వల్లెపు దాసు శేఖర్,తిరుపతి జగదీష్ గౌడ్ లతో కలిసి పన్నాగం పన్నారు.హైదరాబాద్ గాయత్రి నగర్ లో ఉంటున్న గుండమోని శివ,శేషగిరి శివలను కిడ్నాప్ చేసి జల్కం రవి కారులో కడ్తాల్ బటర్ఫ్లై సిటీ వెంచర్ వెంచర్ తీసుకువచ్చారు.అనంతరం వారి మధ్య మాట మాట పెరిగి విచక్షణారహితంగా కత్తితో పొడిచి ఆ విల్లాకు తాళం వేసి




పారిపోయినట్లు తెలిపారు.ఈ కేసులో జంట హత్యలకు కారణం అయిన ఏడుగురుని అరెస్టు చేసి,వారి వినియోగించిన కత్తి,సెల్ఫోన్లను,కారు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.కేసును ఛేదించిన పోలీసులకు ప్రత్యేక అభినందనలు జంట హత్యల కేసును త్వరితగతిన పూర్తిచేసిన పోలీసులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.జంట హత్యల కేసులో శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ నారాయణరెడ్డి,శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్ కుమార్,శంషాబాద్ ఎసిపి రంగస్వామి,కడ్తాల్,షాద్నగర్, శంషాబాద్ సీఐలు శివప్రసాద్,సత్యనారాయణ,పవన్ కుమార్,కడ్తాల్,తలకొండపల్లి ఎస్సైలు శివశంకర వరప్రసాద్,శ్రీకాంత్ లను ఆయన ప్రత్యేకంగా అభినందించి,అధికారులకు రివార్డు అందజేశారు.



# బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

### తెలంగాణ రాష్ట్ర ఎస్ఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు యూ.పోచయ్య.

### ఎన్కెపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ.

మొయినాబాద్ జూన్ 07(ప్రభాత ఉదయం) ప్రభుత్వ పాఠశాలల్లో బడిఈడు పిల్లలందరిని చేర్పించాలని ప్రైవేటు పాఠశాలలు వద్దు, ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అని తెలంగాణ రాష్ట్ర ఎసిఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు యూ. పోచయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎన్కెపల్లి గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉపాధ్యాయులతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్ అన్ని ఉచితంగానే లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా పాఠశాల గదులతో పాటు ప్రాంగణం విశాలంగా ఉన్నాయని పేర్కొన్నారు. పిల్లల కోసం క్రీడల వస్తువులు ఉన్నాయని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించి వారి అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి రుసుములు ఉండవని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్య అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని తెలుపుతూ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూ.పోచయ్య గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్యతోనే భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, క్రమ శిక్షణ నేర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంజూల, బందయ్య, రాములు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.




వ్యవసాయ విశ్వవిద్యాలయం ముఖ ద్వారం

# ఈ నెల 10న ప్రొఫెసర్ జయశంకర్ వర్శిటీ 6వ కాన్వకేషన్

బుద్వేల్, జూన్7(ప్రభాత ఉదయం): ఈ నెల 10వ తేదీన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరవ స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ఇది జరుగుతుందని వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఇంచార్జి ఉపకులపతి ఎం. రఘునందన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గవర్నర్, పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి సీ పీ రాధాకృష్ణన్ అధ్యక్షతన ఈ స్నాతకోత్సవం జరుగుతుందన్నారు. , భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ చెల్లా శ్రీనివాసులు శెట్టి ముఖ్యఅతిథిగా పాల్గొని స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నారని రఘునందన్ రావు వివరించారు. 587 మంది విద్యార్థులకి అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలని, 165 మంది విద్యార్థులకి పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలని అందజేయనున్నట్లు తెలిపారు. 11 మంది పీజీ, పీహెచ్డీ విద్యార్థులు, 8 మంది యూ జీ విద్యార్థులు బంగారు పథకాలు పొందనున్నారని రఘునందన్ రావు పేర్కొన్నారు.




డాక్టర్ ఆర్ కె మాలిక్ కు మెమోంటో అందచేస్తున్న డాక్టర్ పి రఘురామిరెడ్డి

# పంటలలో కలుపు యాజమాన్యంపై వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సదస్సు

బుద్వేల్. జూన్7(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జూన్ 7 నుండి 9వ తేదీ వరకు అఖిలభారత కలుపు నివారణ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల సదస్సు నిర్వహించబడుతుంది. ఈ సదస్సుకు ప్రముఖ మొక్కజొన్న శాస్త్రవేత్త (కన్సల్టెంట్) డాక్టర్ ఆర్ కె మాలిక్ అధ్యక్షత వహిస్తున్నారు. శుక్రవారం ప్రారంభించిన సదస్సులో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి. రఘురామి రెడ్డి మాట్లాడారు. మారిన వాతావరణం పరిస్థితితులకు అనుగుణంగా వివిధ పంటలలో కలుపు యాజమాన్య పద్ధతులు నూతన పోకడలను అనుసరిస్తూ చేపట్టాలన్నారు. తెలంగాణ దక్షిణ మండల డైరెక్టర్ డాక్టర్ ఎం. మల్లారెడ్డి మాట్లాడుతూ, కలుపు మొక్కల నివారణపై పరిశోధనలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్ పి దుబే, డాక్టర్ ఎస్ కె జలాలి, డాక్టర్ పీజీ షా, డాక్టర్ సిమర్జిత్ కౌర్, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన శాస్త్రవేత్తలు మరియు డాక్టర్ టి. రామ్ ప్రకాష్ , డాక్టర్ బి. పద్మజ పాల్గొన్నారు.



# గాదె పవన్ కుమార్‌కు డాక్టరేట్

మొయినాబాద్, జూన్ 07 (ప్రభాత ఉదయం ) మండల పరిధిలోని హిమాయత్ నగర్ సమీపంలో గల చైతన్య డిమ్డ్ టూబీ యూనివర్సిటీలో గాదె పవన్కుమార్ డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా చైతన్య డిమ్డ్ టూబీ యూనివర్సిటీలో గాదె పవన్ కుమార్ కు యువ సాంకేతిక శాస్త్ర విభాగంలో స్క్రీనింగ్ అండ్ మాలిక్యూలర్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఫెస్టిసైట్స్ డిగ్రేడింగ్ బ్యాక్టీరియా ఫ్రేమ్ అగ్రికల్చర్ సాయిల్ ఇన్ తెలంగాణ రిజియన్ అనే అంశంపై ఆచార్య రాజేందర్ వడ్లూరి పర్యవేక్షణలో గాదె పవన్కుమార్ పరిశోధన నిర్వహించారు. దీంతో ఆయనకు డాక్టరేట్ లబించింది. చైతన్య డిమ్ టూబీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య క్రిష్టఫర్ గాదె పవనుమార్ను అభినందించి డాక్టరేట్ ప్రధానం చేశారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో అగ్రికల్చర్ సాయిల్ డిగ్రేడింట్ బ్యాక్టిరియా లాంటి పరిశోధనలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, జగదీశ్వర్, సుందర్రామ్, రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




# క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది

### భువనగిరి పార్లమెంట్ సభ్యులు ఛామల కిరణ్ కుమార్ రెడ్డి

కూకట్‌పల్లి, జూన్ 7 (ప్రభాత ఉదయం) 47 వ జాతీయ త్రోబాల్ ఛాంపియన్ షిప్ 2024 రెండవ రోజు పోటీలలో భాగంగా కేరళ, రాజస్థాన్ లీగ్ ను భువనగిరి పార్లమెంట్ సభ్యులు ఛామల కిరణ్ కుమార్ రెడ్డి, జాతీయ త్రో బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామన్ సాహ్ని, తెలంగాణ త్రో బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆర్గనైజింగ్ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగంప్రారంభించారు. ఈ సందర్భంగా ఛామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చుని, క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కృష్ణ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి కుమార్, ఉపాధ్యక్షులు కృష్ణ రాజపుత్, చిత్ర షినోయ్, శ్వేతా రెడ్డి, కోశాధికారి జమీల్, కోచ్ లు, జాతీయ రిఫరీ బోర్డు, మరియు దేశంలోని 26 రాష్టాలకు సంబంధించిన త్రో బాల్ జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.




# మణికొండ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట

### అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) జయచంద్ర రెడ్డి

గండిపేట,జూన్ 7(ప్రభాత ఉదయం):మణికొండ మున్సిపాలిటీ మణికొండ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) జయచంద్ర రెడ్డి,మండల్ నోడల్ ఆఫీసర్ (ఎంఎన్ఓ) విజయ్ కుమార్ హాజరై బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలీ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ఈ ఒక బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగ నాయక్,మణికొండ మున్సిపాలిటీ ఫ్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు..



# నీట్ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థిని దర్గ రిషిత శ్రీ

### విద్యార్థిని అభినందించిన కళాశాల యాజమాన్యం

### విద్యార్థిని తల్లిదండ్రులు దర్గ నరేందర్, వందన, కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు

మొయినాబాద్ ,జూన్ 07 (ప్రభాత ఉదయం) రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరుహౌగ్రామానికి చెందిన విద్యార్థిని దర్గ రిషితశ్రీ నీట్ పరీక్షలో శ్రీ చైతన్య కళాశాలో ఇంటర్ రెండవ సంవత్సరం చదివిన విద్యార్థిని నీట్లో మంచి ప్రతిభ కనపరిచి ఫలితాల్లోహౌ625/720 మార్కులు సత్తా చాటిన దర్గ రిషితశ్రీ అభినందించిన తల్లిదండ్రులు దర్గ నరేందర్ , దర్గ వందన, మా కూతురు రిషితశ్రీ నీట్ పరీక్షలో 625/720 మార్కులు తెచ్చుకోవడం చాలా సంతోషంగా ఉందని స్కూల్ కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ ఇలాంటి విద్యార్థులు మా కళాశాలలో చదవడం చాలా సంతోషంగా ఉందని నీట్ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థిని రిషితశ్రీ ఇంటర్ రెండవ సంవత్సరం చదివి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని దర్గ రిషితశ్రీని కళాశాల యాజమాన్యం అభినందించారు.

# ఎం ఎం పహాడిలోని హోటళ్లలో తనిఖీలు.. అవగాహన కార్యక్రమాలు


బుద్వేల్, జూన్7(ప్రభాత ఉదయం) : ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఎంఎం పహడి లో రాజేంద్రనగర్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శిరాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో హోటల్ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమా లు నిర్వహించారు. ఎక్కువగా మరిగించిన నూనెను వాడకూడదని తెలిపారు . ఆహార పదార్థాలను రోడ్లపై చేయకూడదన్నారు. హోటల్లో నిలువ చేసే ఆదాపద్దాల పదార్థాలపై కప్పి ఉంచాలన్నారు . హోటల్ నిర్వాహకులు తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. సిబ్బంది చేతులకు గ్లౌజులు, తలకు కవర్ వేసుకొని ఉండాలన్నారు . ఐజినిక్ పద్ధతుల పాటించాలని తెలిపారు . అల్మాస్ రెస్టారెంట్, 999 రెస్టారెంట్ , షాహి బిర్యానీ హోటల్ నిర్వాహకులకు ఆహార భద్రతపై అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు.

**నాలుగు హోటళ్ళలో శాంపిల్స్ సేకరణ :**

ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా ఎం ఎం పహడీలోని హోటళ్లలో అవగాహన కల్పిస్తున్న సమయంలో నాణ్యత పాటించని నాలుగు హోటళ్లను గుర్తించి వాటిలో శాంపుల్స్ సేకరించారు . సేకరించిన శాంపిల్స్ ను ల్యాబ్ కు పంపించడం జరిగిందని శిరాజ్ అహమ్మద్ తెలిపారు. ఇప్పటివరకు నిబంధనలు, నాణ్యత పాటించని హోటళ్లకు 1,20,000 జరిమానాలు విధించినట్లు ఆయన వెల్లడించారు.



ఎం ఎం పహాడి లో గల హోటళ్లలో తనిఖీలు చేస్తున్న రాజేంద్రనగర్ ఫుడ్ సేఫ్టీ అధికారి శిరాజ్ అహ్మద్




ఫ్రిజ్ లలో నిల్వ ఉంచిన పదార్థాలను పరిశీలిస్తున్న శిరాజ్ అహ్మద్

# బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

## జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్

### బడిబాట కార్యక్రమంలో అధికారులందరూ నిబద్ధతతో పని చేయాలి



సంబంధిత శాఖ అధికారులతో సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 7(ప్రభాత ఉదయం ఉదయం)బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలనే సంకల్పంతో ఈనెల 6 నుండి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమంలో అధికారులు అందరు నిబద్ధతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, ముసిని వెంకటేశ్వర్లుతో కలిసి సంబంధిత శాఖాధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బడిబాట కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు తిరిగి పాఠశాలల్లో చదువుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో పత్తి పొలాల్లో పనిచేసేందుకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఎక్కువమంది డ్రాప్ అవుట్స్ అవుతుండడంతో చదువులో వెనకబడుతున్నారన్నారు. బాల కార్మికులు కూడా ఎంత మంది ఉన్నారు, ఎక్కడెక్కడ పని చేస్తున్నారో సంబంధిత అధికారులు వివరాలు సమర్పించాలని ఆదేశించారు. బడి మానేసిన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అంగన్వాడి కేంద్రాల నుంచి ఒకటవ తరగతిలో, ప్రాథమిక పాఠశాలల నుంచి ఆరో తరగతిలో ఎంత మంది విద్యార్థులు చేరుతున్నారో పక్కా వివరాలు ఎప్పటికప్పుడు సేకరించి పంపాలని ఆదేశించారు. ఏ ఒక్క విద్యార్థి బడి బయట ఉండకుండా పాఠశాలల్లో చదువుకునేలా మండల స్థాయిలో, గ్రామ స్థాయిలోనూ సంబంధిత అధికారులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించుకుని ఆ వివరాలు ఎప్పటికప్పుడు పంపించాలన్నారు. పాఠశాలల్లో గతంలో ఎంత మంది పిల్లలు ఉండేవారు, ఈ విద్యా సంవత్సరం ఎవరెవరు రావడంలేదనే వివరాలు ఉపాధ్యాయులు, సంబంధిత ప్రధానోపాధ్యాయులకే ఎక్కువగా తెలుస్తుందని వారి సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు.. సీఆర్పీలు ఇప్పటికే ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లో చదువుకునేలా అవగాహన కల్పిస్తుండడంతో వారు వంద శాతం మెరుగైన పనితీరు కనబరిచేలా విద్యాశాఖ అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కస్తూర్బా పాఠశాలల్లో సీటు లభించని అమ్మాయిలకు ఆయా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విధంగా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పిల్లలు బడి మధ్యలో మానేయడానికి తల్లిదండ్రులు చెబుతున్న కారణాలు, ఏర్పడుతున్న ఇబ్బందులు ఏమిటో తెలుసుకొని వాటిని పరిష్కరించాలని చెప్పారు. అదేవిధంగా పదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులు ఇంటర్, పాలిటెక్నిక్, పై చదువులు చదువుకొనుటకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లలను బడికి పంపకుండా పనిలో పెట్టుకుంటే చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకుంటామో తెలియజేసే అంశాలతో కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫలితంగా జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించే అవకాశం ఉందన్నారు. ఈనెల 12న పాఠశాలలు ప్రారంభమయ్యే రోజు నుంచే విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను అందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు తెలియజేశారు.. గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలో చివరి నుంచి రెండో స్థానంలో ఉండడంతో ఈ విద్యా సంవత్సరం మెరుగైన స్థానాన్ని సాధించేందుకు ఇప్పటి నుంచే ఆయా పాఠశాలలకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి పర్యవేక్షణ చేయనున్నట్లు చెప్పారు. బడిబాట సందర్భంగా నిర్వహించే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరి తోడ్పాటుతో మన జిల్లా అక్షరాస్యతలో ముందుండేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మండలాల వారీగా విద్యార్థుల వివరాలు, బడిబయటి విద్యార్థుల సంఖ్య, బడిబాట విజయవంతానికి చేసిన ప్రణాళికలు వివరాలు సంబంధిత మండల విద్యాధికారులు, ఎంపీడీవోలు, పుర కమిషనర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఆర్డిఓ రాంచందర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఇందిర, ఇతర జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.




# మిస్సింగ్ కేసును గంటల వ్యవధిలో చేదించిన బాలానగర్ పోలీసులు

కూకట్‌పల్లి, జూన్ 7 (ప్రభాత ఉదయం) బాలానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పదేళ్ళ ఓ బాలుడు మిస్సింగ్ కలకలం రేపింది. సమాచారం అందుకున్న బాలానగర్ సీఐ నవీన్ కుమార్ వెంటనే స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. మిస్సింగ్ కేసును గంటల వ్యవధిలోనే బాలానగర్ పోలీసులు ఛేదించారు. బాలానగర్ సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలోని ఏపీహెచ్ బి కాలనీ లో నివాసముండే ఎలిమినేటి రాజశేఖర్ రెడ్డి కుమారుడు ఎలిమినేటి కృతిక కళ్యాణ్ రెడ్డి (10), గురువారం సాయంత్రం ఆడుకుంటానని ఇంటి నుంచి వెళ్ళిన పదేళ్ళ బాలుడు కనిపించకుండా పోయాడు. దీంతో బాలుని తల్లిదండ్రులు పోలీసులకు కంప్లైంట్ చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ పుటేజ్ ఆధారంగా గాలింపు చేపట్టారు. సైకిల్ పై గండిమైసమ్మ వైపు వెళ్లినట్లు గ్రహించిన పోలీసులు, కేసును కొద్దీ గంటల్లో చేధించి, బాలుని క్షేమంగా తల్లిదండ్రులు అప్పగించారు. బాలుని కుటుంబసభ్యులు క్షేమంగా తమ కొడుకును అప్పగించినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



# మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి భద్రత ఎక్స్గ్రేసియ చెక్కును జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు అందజేసిన ఏవో సతీష్

ఇటిక్యాల, జూన్7(ప్రభాత ఉదయం) ఇటిక్యాల పోలీస్ స్టేషన్ లో పనిచేస్తూ ఈ సంవత్సరం జనవరి నెలలో అనారోగ్యం చేత మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎం ప్రసాద్ కుటుంబ సభ్యులకు శుక్ర వారం జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు ఏవో సతీష్ ఎనిమిది లక్షల రూపాయల భద్రత ఎక్స్ గ్రేసియ చెక్కును అందించారు. పెన్షన్ , ఇతర ప్రయోజనాలను త్వరగా అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ నాగేంద్ర గారు , సీనియర్ అసిస్టెంట్ వినోద్ గారు మరియు ఎం ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# జిల్లాలో టీజీపిఎస్‌సి గ్రూప్-1 వ్రాత పరీక్ష జరిగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

## జిల్లా ఎస్పీ రితిరాజ్

### పరీక్షా కేంద్రాల వద్ద 105 మంది పోలీస్ లతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 7(ప్రభాత ఉదయం) తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీసు శాఖ తరపున అన్ని రకాల భద్రతపరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ రితిరాజ్ వివరించారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఆదివారం 9 తేది గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల దగ్గర ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా 105 మంది పోలీస్ సిబ్బందితో పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు గద్వాల్ టౌన్-11, గద్వాల్ రూరల్-1 ఎర్రవల్లి-2 కలవు. మొత్తం 5231 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో 06:00 గం: నుండి మధ్యాహ్నం 1:00 గం: వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కావున పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 100 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దు , పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, మూసి వేయాలని, చుట్టుపక్కల లౌడ్ స్పీకర్స్ పెట్టరాదు. అభ్యర్థులను ఉద్దేశించి ఎస్పీ రీతి రాజ్ మాట్లాడుతూ పరీక్షా సమయానికి 1:00 గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లా ఎస్పీ గారు సూచించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్ష వ్రాసే అభ్యర్థులకు సూచనలులిపరీక్ష సమయం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు, నిర్వహించబడుతుంది. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు బయోమెట్రిక్ మాదిరిగా ఫింగర్ ప్రింట్ తీసుకోవడం జరుగుతుంది వెరిఫికేషన్ సిబ్బందికి సహకరించవలసిందిగా సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఒక కలర్ ఫోటో, ఒరిజినల్ ఆధార్ కార్డు /డ్రైవింగ్ లైసెన్స్ /ఓటర్ గుర్తింపు కార్డు / ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకొని రావాల్సి ఉందన్నారు. పరీక్ష రోజున ఉదయం 9 గంటల నుండి అభ్యర్థులను ఎగ్జామ్ హాల్లోనికి అనుమతి ఇస్తారని, 10 గంటలకు ఎగ్జామ్స్ సెంటర్ గెట్ మూసి వేయడం జరుగుతుందని 10 గంటల తర్వాత ఒక్క సెకండ్ ఆలస్యంగా వచ్చిన ఎవ్వరిని పరీక్ష కేంద్రం లోనికి అనుమతించడం జరగదు. డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్ లో ఉన్న నిబంధనలు అభ్యర్థులు చదువుకొని వాటిని పాటించాలని సూచించారు. చివరి నిమిషంలో వచ్చి ఇబ్బంది పడకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు. పరీక్షా కేంద్రంలోకి బ్యాగులు, సెల్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వాచ్లు, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. అభ్యర్థులను మెటల్ డిటెక్టర్ ద్వార పరిశీలించి పరీక్షా కేంద్రంలోనికి పంపించడం జరుగుతుంది.అభ్యర్థులు తమ వెంట పరీక్ష హాల్ టికెట్, (బబ్లింగ్) బ్లూ, బ్లాక్, బాల్ పెన్స్ మాత్రమే తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ చేసినట్లు తేలితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



# బడీడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరి ఉన్నత విద్యను అభ్యసించాలి

## నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్

నార్సింగి ,జూన్ 7(ప్రభాత ఉదయం):ప్రో జయ శంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్,కౌన్సిలర్ పద్మ వీర రెడ్డి,ఉపాధ్యాయులు రవి,రాములు,మాజి వార్డ్ సభ్యులు దామోదర్ రెడ్డి,శ్రీరాములు,గండయ్య,కృష్ణ విచ్చేసి బడీడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలు చేరి మంచి విద్యను అభ్యసించాలని ఆమె కోరారు.అనంతరం ప్రాథమిక పాఠశాల మంచిరేవులలో విద్యను అభ్యసించాలని తెలియ చేయడం జరిగిందన్నారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలని నార్సింగ్ మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిఎస్ మంచిరేవుల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నేటినుంచి మృగశిర కార్తె

## చేపమందు పంపిణీకి ఏర్పాట్లు

హైదరాబాద్, జూన్ 7 (ప్రభాత ఉదయం): హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మృగశిర కార్తెను పురస్కరించుకుని శని,ఆదివారాల్లో రెండ్రోజుల పాటుచేప ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నారు. ఇందుకుగాను అధికారులు తగిన ఏర్పాట్లు చేసారు. మత్స్యశాఖ అవసరమైన చేప పిల్లలను సమకూరుస్తుండగా, దూర ప్రాంతం నుంచి వచ్చే వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు తెలంగాణ ఆర్టీసీ అదనంగా 130 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. చేప ప్రసాదం కోసం నగరానికి వచ్చేవారు ఇబ్బందులు పడకుండా వివిధ ప్రాంతాల నుంచి నేరుగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు బస్సులు నడుపుతోంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాచిగూడ రైల్వే స్టేషన్, జేబీఎస్, ఈసీఐఎల్, ఈసీఐఎల్ క్రాస్‌రోడ్స్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, దిల్‌సుఖ్‌నగర్, ఎన్జీవోస్ కాలనీ, మిథాని, ఉప్పల్, చార్మినార్, గోల్కొండ, రాంనగర్, రాజేంద్రనగర్, రిసాల బజార్, పటాన్‌చెరు, జీడిమెట్ల, కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి నుంచి ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి.



# పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన కే వాణికి 25 వేల ఆర్థిక సాయం చేసిన వైస్ చైర్మన్ కొండకల నరేందర్ రెడ్డి

గండిపేట,జూన్ 7(ప్రభాత ఉదయం):పేదరికనికి చదువు అడ్డు రాదని అనే సామెతను నిజం చేసి చూపించిన కే వాణి మునుముందు ఉన్నత శిఖరాలకు చేరుతుందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండకల నరేందర్ రెడ్డి తెలిపారు.శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం గూడూరు గ్రామవాసి మణికొండ మునిసిపాలిటీ వైస్ చైర్మన్ కొండకల నరేందర్ రెడ్డి 25,000 రూపాయలు హార్దిక సహాయం అందించారు.మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీ లోని అపార్ట్మెంట్లో వాచ్మెన్ గా పనిచేస్తున్న కే బాలు కూతురు కే వాణి మణికొండ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో పాస్ అయ్యి 9.5 జిపిఏ సాధించింది.కావున కాలేజీలో చదువుకోడానికి హార్థిక స్తోమత లేనందున మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కొండకల నరేందర్ రెడ్డి ఆర్థిక సాయం చేయడం జరిగినదన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిజెపి అధ్యక్షులు సి బీరప్ప,నాయకులు ఈ నర్సింగ్ రావు,శివరాం రెడ్డి,రంగబాబు,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తిపన్ను మదింపు..వాటర్ బిల్లులపై నజర్

## ఆదాయాన్ని సమకూర్చేందుకు జిహెచ్ఎంసి కసరత్తు

హైదరాబాద్, జూన్ 7 (ప్రభాత ఉదయం): ఆస్తులు, భవనాల సమగ్ర సర్వే చేయాలని జిహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఆస్తి, నీరు, ఇతర పన్నులను సంబంధించి సమర్ధవంతంగా రికవరీ చేయడానికి.. డిఫాల్టర్లను మెరుగ్గా ట్రాకింగ్ చేయడానికి జిఎస్ఐ ఆధారిత సర్వేకు గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా.., ప్రతీ ఎలాట్, భవనం యొక్క సరిహద్దులను తెలుసుకోవడానికి సిటిజన్ సెంట్రిక్ సర్వీస్ తో ఉపగ్రహ డేటా, డ్రోన్ లను ఉపయోగించాలని నిర్ణయం తీసుకున్నారు అధికారులు. ఈ సంఘర్భంగా ఆస్తులను తక్కువ అంచనా వేయడం, పన్నులు ఎగవేస్తున్న వారిపై నిఘా ఉంచేందుకు జిఐఎస్ సర్వే సహాయపడుతుందని అధికారులు భావిస్తున్నారు.ఈ పనిని నియో జియో ఏజెన్సీకి రెండేళ్ళ పాటు భాధ్యతలు జిహెచ్ఎంసీ అప్పగించింది. ఈ సర్వేలో ఏడాదిన్నరలో ఏకంగా 20 లక్షల భవనాలను సర్వే చేసేలా ఏజెన్సీ కి టాగ్ంగట్?పెట్టనున్నట్లు సమాచారం. సర్వే వివరాలను ఏరోజుకు ఆరోజు సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు అందించేలా ప్లాన్చేయనున్నారు. ఈ విషయంలో రిపోర్టు అందగానే సర్కిల్ స్థాయి అధికారులు భవనం విస్తీర్ణం ఇదివరకు ఎంత ఉండేది, ఇప్పుడు ఏమైనా మార్పు ఉందా అన్న వివరాలను పరిశీలించి., విస్తీర్ణంలో మార్పు ఉంటే వెంటనే వారి అసెస్మెంట్ లో విస్తీర్ణాన్ని మార్చి జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం రెండున్నరేండ్ల ప్రపార్టీ ట్యాక్స్ ను వెంటనే వసూలు చేయనున్నారు. ఇలాంటి సర్వే ఇప్పటికే మహారాష్ట్ర లోని బృహన్ ముంబై కార్పొరేషన్ అమలు పరుస్తుంది. జీహెచ్ఎంసీ అధికారులు కొందరు అక్కడి పనితీరును ఇదివరకే పరిశీలించారు.

# ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి

## టిఎస్ ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నివాస్

శంషాబాద్,జూన్ 7(ప్రభాత ఉదయం):భూ మండలానికి సంభవించే పెను ప్రమాదాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటి రక్షించుకునే బాధ్యత మనపై ఉందని టిఎస్ ఎస్ ఓ రాష్ట్ర నాయకులు లక్ష్మీనివాస్ పిలుపునిచ్చారు.శుక్రవారం శంషాబాద్ మండలం పెద్దషాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్,ఆశా వర్కర్లతో కలిసి మొక్కను నాటిన టి ఎస్ ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా లక్ష్మీ నివాస్ మాట్లాడుతూ...సమాజంలో సమూల మార్పులు తీసుకువచ్చే శక్తి విద్యార్థులో ఉంటుందని అన్నారు.ప్రజలు,యువత సామాజిక స్పృహను అలవార్చుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ప్రజలంతా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు.చెట్లు లేకుంటే వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని,కాలుష్యం మానవ జీవన ప్రమాణాలు ప్రశ్నార్థకంగా మారుతాయన్నారు.కాలుష్యాన్ని తరిమికొట్టాలంటే ప్రతి ఇంటి ఆవరణలో,వ్యవసాయ పొలాలలో మొక్కలు నాటాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్స్,ఆశా వర్కర్లు, టి ఎస్ ఎస్ ఓ రాష్ట్ర నాయకులు సుదర్శన్,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.